క్లుప్తంగా

పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ద్వారక తిరుమల ఈఓ

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామికి బుధవారం శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం ద్వారకా తిరుమల (చిన్న తిరుపతి) ఆలయం తరఫున స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. దేవస్థానం ఈఓ ఎన్‌వీఎస్‌ఎన్ మూర్తి కుటుంబ సమేతంగా దేవస్థానం అతిథిగృహం నుంచి మేళతాళాల నడుమ స్వామివారికి పట్టువస్త్రాలను తీసుకొచ్చారు. వారికి కాణిపాకం దేవస్థాన ఈఓ పెంచలకిషోర్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చూశారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ద్వారక తిరుమల దేవస్థానం ఏఈఓ రమణ రాజు, కాణిపాకం దేవస్థానం ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, ధనంజయ, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు, వేద పండితులు, అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వెలుగు సీసీ మృతి



వెంకటేష్

యాదమరి: మండల పరిధిలోని కాశిరాళ్ల క్లస్టర్ వెలుగు సీసీగా పని చేస్తున్న ఎ.వెంకటేష్(45) అనారోగ్యంతో కన్నుమూశారు. గత కొద్దిరోజులుగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్నారు. అయితే సమస్య తీవ్రమవడంతో కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ఆయనను రాణిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి కన్నుమూశారు. బుధవారం ఆయన స్వగ్రామమైన గుడిపాల మండలం 189కొత్తపల్లికి మృతదేహాన్ని తీసుకురాగా.. డీఆర్డీఏ అధికారులు, సంఘమిత్రలు నివాళులు అర్పించారు. డీఆర్డీఏ సీనియర్ సహాయకులు సుబ్రమణ్యం, ఏపీ చిట్టిబాబు అంత్యక్రియలకు గానూ రూ.25 వేలను మృతుడి కుటుంబసభ్యులకు అందించారు.

ఒకే ఈతలో రెండు పేయి దూడలు



రెండు పేయి దూడలతో ఆవు

ఐరాల: ఒకే ఈతలో ఒక ఆవు రెండు పేయి దూడలను ఈనింది. మండల కేంద్రంలోని వీఎస్ అగ్రహారానికి చెందిన రైతు గుర్రప్ప మాట్లాడుతూ బుధవారం తన ఆవు ఐదో ఈతలో రెండు పేయి దూడలు ఈనిందని తెలిపారు. రెండు పేయి దూడలు ఒకే ఈతలో పుట్టడం ఆనందంగా ఉందన్నారు. ఆవు, దూడలు ఆరోగ్యంగా ఉన్నాయని తెలిపారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు



పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

ఐరాల: వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలంటే సేంద్రియ ఎరువులే శ్రేయస్కరమని డీఆర్‌సీ ఏఓ ప్రసన్నలక్ష్మి సూచించారు. బుధవారం మండలంలోని ఐలవారిపల్లెలో ఏఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయంలో ఎరువుల ఎంపిక అత్యంత ప్రాధాన్యం కలిగి ఉందన్నారు. సాగుకు ముందుగా మట్టి పరీక్షలు చేయించుకుని దానికి అనుగుణంగా మంచి ఎరువులను ఎంచుకోవాలన్నారు. భూసారానికి హాని కలిగించే రసాయన ఎరువులు మోతాదును తగ్గించి పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువులు వంటి సేంద్రియ ఎరువులను అధికంగా వినియోగించాలన్నారు. అనంతరం రైతులు సాగు చేసిన వరి పంటను పరిశీలించి, వరి సాగులో తీసుకోవాల్సిన సస్య రక్షణ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఏఏ కళావతి పాల్గొన్నారు.

నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని గిరింపేట చెంగల్వరాయకొండపై వెలసిన శ్రీ సుబ్రహ్మణ్యస్వామి దేవస్థానం నూతన పాలకవర్గ ప్రమాణస్వీకారం బుధవారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు. దేవదాయశాఖ అధికారుల సమక్షంలో నూతన చైర్మన్‌గా సంపత్‌తో పాటు సభ్యులుగా శ్రీనివాసబాబు, నందకుమార్, మోహన్ బాబు, సెల్వి, వనిత, జమున, పద్మనాభం బాధ్యతలు చేపట్టారు. ఆలయాభివృద్ధికి చర్యలు చేపడతామని చైర్మన్ తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, పార్థసారథినాయుడు, భాను, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

మా దగ్గర మందుల్లేవ్..

గ్రామాల్లో పాడి పరిశ్రమపై ఆధారపడి బతుకుతున్న రైతులు పశువులకు రోగం వస్తే గతంలో మండలకేంద్రాలకు పరుగులు పెట్టేవారు. లేదంటే ప్రైవేటు పశువైద్యులపై ఆధారపడేవారు. పాడి రైతుల ఇబ్బందులను గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పశు ఆరోగ్య సేవల సంచార వాహన కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసింది. పశువైద్య సిబ్బంది సంచార వాహనాల్లో గ్రామాలకే వెళ్లి పశువులకు వైద్యసేవలు అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సంచార వాహనాల నిర్వహణ గాలికొదిలేసింది. గ్రామాలకు వెళ్లే వాహనాల్లో మందులు లేవని సిబ్బంది చెబుతున్నారు. దీంతో రైతులు ప్రైవేటుగా మందులు కొని తెస్తే వైద్యం చేస్తున్నారు.

- గ్రామాల్లో పశువులకు అందని వైద్యం
- అరకొరగా పశు ఆరోగ్య సంచార వాహనాల సేవలు
- వైద్యం చేయడానికి మందులు లేవని చెబుతున్న పశువైద్య సిబ్బంది
- రైతులు నగరానికి వెళ్లి కొనుగోలు చేసి తెచ్చుకోవాల్సిన దుస్థితి
- పాడి రైతులకు తప్పని అవస్థలు



గుడిపాలలో సంచార పశు ఆరోగ్య సేవల వాహనం

గుడిపాల: పాడి రైతులు ఫోన్ చేసిన వెంటనే క్షేత్రస్థాయికి వెళ్లి వైద్యసేవలు అందించాల్సిన పశు వైద్య సంచార వాహనాలు రోజురోజుకూ నిర్వీర్యమైపోతున్నాయి. పశువుల చికిత్సకు మందులు లేకుండానే గ్రామాలకు వెళ్తున్నాయి. దీంతో పాడి రైతులు ప్రైవేట్‌గా డబ్బులు వెచ్చించి మందులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పశువుల వైద్యానికి సత్వర సేవలు అందించేందుకు పశువైద్య సంచార వాహనమిత్ర వాహనాలను అందుబాటులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. 1962 టోల్ ఫ్రీ నంబర్‌ను సైతం అందుబాటులోకి తెచ్చింది. నియోజకవర్గానికి రెండు వాహనాలు చొప్పున.. రెండు మండలాలకు ఒక వాహనం వైద్య సేవలు అందించేవి. శస్త్ర చికిత్సలు చేయాల్సి వస్తే దగ్గరలోని ప్రాంతీయ పశు వైద్యశాలలకు తరలించి, అక్కడ చికిత్స అందించి అనంతరం గ్రామానికి పంపించేవారు. చిత్తూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు రెండు చొప్పున 14 సంచార పశు ఆరోగ్య వాహనాలు ఉన్నాయి.

ప్రైవేట్‌గా మందులు కొనాలి..

మూగజీవాలకు చికిత్స అందించడానికి వచ్చే సంచార పశు ఆరోగ్య సేవ వాహనాల్లో మందులు ఉండడం లేదు. దీంతో పాడి రైతులు పశువైద్యుడు చెప్పిన మందులను ప్రైవేట్ మందుల దుకాణంలో కొనుగోలు చేసి తీసుకొస్తే వారు వైద్యం చేస్తున్నారు. దీంతో రైతులకు చేతి చమురు వదులుతోంది. సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలను గతంలో జీవీకే సంస్థ నిర్వహించేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత భవ్య హెల్త్ ప్రొవైడర్స్ సంస్థకు అప్పగించింది.

గతానికి భిన్నంగా..

సంచార పశు ఆరోగ్య సేవ వాహనాలను గతానికి భిన్నంగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాహనంలో ఒక పశువైద్యుడు, వెటర్నరీ డిప్లొమో చేసిన సహాయకుడు, డ్రైవర్(అటెండర్)తో కలిపి మొత్తం ముగ్గురు ఉంటారు. గతంలో నెలకు 3 నుంచి 4 వేల కిలోమీటర్ల మేర ఒక్కో వాహనం సేవలు అందించేవి. ఇప్పుడు వాహనాలు నెలకు 500 కిలోమీటర్లు కూడా తిరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. అంతేకాకుండా రోజుకు ఒక్క గ్రామంలోనే వాహనం పెట్టి సేవలు అందిస్తున్నారు. అలాగే కొన్ని గ్రామాలకు వాహనాలు వెళ్లడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

జిల్లాలో పశువుల సంఖ్య

ఆవులు	:	4,97,172
గేదెలు	:	2860
గొర్రెలు	:	3,87,125
మేకలు	:	1,82,014
పందులు	:	1371

మండలకేంద్రానికి వెళ్లి తెచ్చిన..

మా ఆవులకు అనారోగ్య సమస్యలు వచ్చాయి. ఫోన్ చేయగానే సంచార పశు ఆరోగ్య సేవ వాహనంలో వచ్చారు. వైద్యులు ఆవులకు వైద్యం చేసి మందులు రాశారు. వాహనంలో మందులు లేవని చెప్పారు. ఆ మందులను గుడిపాల మండల కేంద్రానికి వెళ్లి తెచ్చుకున్నాం.

– రామ్మూర్తి, బసవాపల్లె, గుడిపాల

మందులు వస్తాయి



సంచార పశువైద్యశాలల్లో మందుల కొరత ఉంది. ఇదివరకే పైస్థాయి అధికారులకు ఇండెంట్ పెట్టాం. త్వరలో మందులు వస్తాయి. వచ్చిన వెంటనే సంచార పశు వైద్యశాలలకు అందిస్తాం. ఇకపై పాడి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం. – సాయిసుధ, పశువైద్యాధికారి, గుడిపాల

మద్దతు ధర ఇవ్వకపోతే ఫ్యాక్టరీలకు తాళం వేస్తాం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మామిడికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను కొన్ని ఫ్యాక్టరీ ఇవ్వడం లేదని, వాటికి కచ్చితంగా తాళం వేస్తామని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ స్పష్టం చేశారు. చిత్తూరు నగరంలోని మామిడి కాయల మార్కెట్‌లో బుధవారం మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మామిడిలోని తోతాపురి రకానికి ప్రభుత్వం రూ.12 మద్దతు ధర ప్రకటించిందన్నారు. కేజీకి ప్రభుత్వం రూ.4 ప్రోత్సాహక నిధి ఇస్తే.. ఫ్యాక్టరీలు రూ.8 ఇవ్వాలని ఆదేశించిందన్నారు. అయితే కొన్ని ఫ్యాక్టరీలు ముఖ్యమంత్రి ప్రకటించిన మద్దతు ధర ఇవ్వడం లేదనే విషయాన్ని మామిడి రైతు సంఘం నాయకులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. కచ్చితంగా ఫ్యాక్టరీలు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఇచ్చి తీరాలని.. లేకుంటే జిల్లాలోని ఎమ్మెల్యేలతో కలిసి వాటికి తాళం వేస్తామన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఝాన్సీ, సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల

మెనూ ప్రకారం భోజనం అందించాలి



బంగారుపాళెం: ఎస్టీ గురుకుల పాఠశాలలో భోజనం నాణ్యతను పరిశీలిస్తున్న పద్మమ్మ



బొమ్మాయిపల్లెలో పిల్లల బరువును చూస్తున్న స్పెషల్ ఆఫీసర్

బంగారుపాళెం: అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని పట్టుపరిశ్రమల శాఖ సంయుక్త సంచాలకులు, మండల ప్రత్యేక అధికారి పద్మమ్మ అన్నారు. బుధవారం బంగారుపాళెంలోని ఎస్టీ గురుకుల పాఠశాల, బొమ్మాయిపల్లె, బేరిపల్లె, మహాసముద్రం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. తొలుత ఆమె ఎస్టీ గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో ఎంతమంది చదువుతున్నారు ? ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారు ? అనే విషయాల గురించి ప్రిన్సిపల్ వెంకట సుబ్బయ్యను అడిగి తెలుసుకున్నారు. సరుకుల స్టాక్ రిజిష్టర్లు పరిశీలించారు. విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనాన్ని రుచి చూశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారం సక్రమంగా అందిస్తున్నారా లేదా అనే విషయంపై ఆరా తీశారు. అంగన్‌వాడీ పిల్లల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. పిల్లల ఎత్తు, బరువు సరి చూశారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ అందించాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న సదుపాయాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజరు షామీదాబేగం, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ క్లినిక్‌లపై దాడులు

గుడిపాల: మండలంలో నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీ క్లినిక్‌లపై బుధవారం గుడిపాల వైద్యాధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. డాక్టర్ సంధ్య పిళ్లారికుప్పంలో నిర్వహిస్తున్న ఆర్‌ఎంపీ క్లినిక్‌పై దాడులు నిర్వహించి రోగులకు ఇంజెక్షన్లు వేయడం , యాంటీ బయాటిక్ మాత్రలు ఇవ్వడం వంటివి చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే తుమ్మిందపాళ్యంలో గుడిపాల క్లస్టర్ హెల్త్ ఆఫీసర్ సూర్యనారాయణ తమ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఎక్కడైనా ఆర్‌ఎంపీలు నిబంధనల మేరకే వైద్యం చేయాలన్నారు. అనవసరంగా చికిత్స చేస్తే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



గుడిపాల: పిళ్లారికుప్పంలో ఆర్‌ఎంపీ క్లినిక్‌లను తనిఖీ చేస్తున్న డాక్టర్ సంధ్య

అంగన్‌వాడీల సమస్యలపై అలసత్వం తగదు



జాయింట్ సమావేశంలో సమస్యలు చర్చిస్తున్న అంగన్‌వాడీ సంఘాల నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అంగన్‌వాడీల సమస్యల పట్ల అలసత్వం వహించడం తగదని సీఐటీయూ అనుబంధ సంఘం గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు అన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని ఐసీడీఎస్ కార్యాలయంలో జాయింట్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ కుప్పం, పుంగనూరు ప్రాజెక్టుల్లోని అంగన్‌వాడీలను బెదిరిస్తున్న సూపర్‌వైజర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్వేటినగరం ప్రాజెక్టులో 9 మందికి చెల్లించాల్సిన ఏడు నెలల వేతనాలు వెంటనే మంజూరు చేయాలన్నారు. ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. బంగారుపాళ్యం ప్రాజెక్టు పరిధిలోని యాదమరి మండలంలో సబ్‌సెంటర్ పెట్టి అంగన్‌వాడీలకు సౌకర్యం కల్పించాలన్నారు. ఐరాల, పూతలపట్టు మండలాల్లోని అంగన్‌వాడీ సెంటర్లకు రెండవ సిలిండర్ అందజేయాలన్నారు. బైరెడ్డిపల్లి, పలమనేరు ప్రాజెక్టుల్లో సిబ్బందిపై వేధింపులు మానుకోవాలన్నారు. అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తించే విధంగా అధికారులు సిఫార్సులు చేయాలన్నారు. అంగన్‌వాడీ సంఘాల నాయకులు షకీలా, ప్రేమ, జ్యోతి మాట్లాడుతూ సెంటర్‌లకు అద్దెలు చెల్లించాలన్నారు. సెలవులు కావాలంటే ఆఫీసుకు రండి అని అధికారులు చెప్పడం సరైన పద్ధతి కాదన్నారు. మెమోలు ఇచ్చి ఉద్యోగాల నుంచి తీసేస్తామని బెదిరింపులకు పాల్పడడం మానుకోవాలని హెచ్చరించారు. సమావేశంలో ఐసీడీఎస్ కార్యాలయ సిబ్బంది కరుణాకర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండన్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి

ఐరాల: ప్రాణాంతక వ్యాధుల నుంచి చిన్నారులను కాపాడేందుకు టీకాల కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డెప్ప సూచించారు. బుధవారం పీహెచ్‌సీ పరిధిలోని సబ్ సెంటర్లలో చిన్నారులకు వేస్తున్న టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు టీకాలు వేయడం ద్వారా ధనురాత్వం, క్షయ, కోరింత దగ్గు, తట్టు, పోలియో, హెపటైటిస్–బి, చికెన్ ఫాక్స్, గవదబిళ్లలు వంటి వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తోందని తెలిపారు. టీకాలు పిల్లల రోగ నిరోధక వ్యవస్థను బలపరిచి, వ్యాధికారక క్రిములతో పోరాడడానికి సహాయ పడతాయన్నారు. టీకాలు వేయడం వల్ల పిల్లల ఆరోగ్యం మాత్రమే కాకుండా, రోగ నిరోధకశక్తి తక్కువగా ఉన్న వారు, నవజాత శిశువులు ఇతరులు కూడా రక్షించబడతారని తెలియజేశారు. పీహెచ్‌సీ పరిధిలోని ఎస్టీ కాలనీలో తల్లిదండ్రులకు అవగాహన కల్పించి అప్పుడు పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు టీకాలు వేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఆదిలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



చిన్నారులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

నూతన కమిటీ ఎన్నిక



సుబ్రమణ్యపిళ్లై, అధ్యక్షుడు



సుల్తాన్, మైనార్టీ కన్వీనర్

యాదమరి: మండల ఎస్టీయూ నూతన అధ్యక్షుడిగా సుబ్రమణ్యపిళ్లై ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆ సంఘ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్ రెడ్డి పర్యవేక్షణలో నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఎస్టీయూ మండల అధ్యక్షుడిగా పని చేస్తూ ఇటీవల పదవీ విరమణ చేసిన గుణశేఖరన్ స్థానంలో దళవాయిపల్లి ఆదర్శ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సుబ్రమణ్యపిళ్లైని సంఘ నూతన అధ్యక్షుడిగా, కె.గొల్లపల్లి పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులుగా ఉన్న సుల్తాన్ మైనార్టీ కన్వీనర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు చెప్పారు. ఎన్నికైన సభ్యులు ఎస్టీయూ అభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సంఘ మండల గౌరవాధ్యక్షులు బాష, ప్రధాన కార్యదర్శి రమేష్, ప్రమీళకుమారి, గణపతి, రంగనాథం, ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవం.. బ్రహ్మోత్సవం

బాదం గింజలతో వినాయకుడు



ఉత్సవమూర్తి





నయాండి నృత్యం



చాక్లెట్ గణపతి



నృత్య ప్రదర్శన ఇస్తున్న సంజనారెడ్డి





బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి వాహనసేవల ముందు ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులతో ఈఓ, నృత్యం చేస్తున్న బాలికలు

కాణిపాకం: కాణిపాకం బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో, వెలుపల చేపట్టిన పలు ప్రత్యేక అలంకరణలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా బాదం గింజలతో, చాక్లెట్‌తో తయారు చేసిన గణపతి ప్రతిమలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఆలయంలో ప్రత్యేకంగా తెప్పించిన పూలతో చేసిన అలంకరణ ఆహుతులను ఆకట్టుకున్నాయి. . రథోత్సవం ముందు వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారుల ప్రదర్శనలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి. కోలాటాలు, డప్పు వాయిద్యాలు, నయాండీ, లంబాడీ, చెక్క భజనలతో భక్తులను ఉత్సాహ పరిచారు. అలాగే స్వామివారి ఆస్థాన మండపంలో కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు, హరికథా గానాలు అలరించాయి. అలాగే నెల్లూరు నగరానికి చెందిన బాలిక సంజనారెడ్డి కూచిపూడి విభాగంలో శివతాండవం నాట్యం అద్భుతంగా ప్రదర్శించి ఆహుతులతో శభాష్ అనిపించుకుంది.